పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితా తయారీతో పాటు ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్లు, పర్మర్ పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కోరారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని ఆదేశించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు మురళీకృష్ణ, రామ్మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవీందర్ పాల్గొన్నారు.

'ఉపాధిహామీ కూలీలకు పనులు చూపాలి'

దేవరుప్పుల, డిసెంబర్ 20 : ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనం అందేలా పనులు కల్పించాలని అడిషనల్ పీడీ బాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ఉమామహేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షకు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రసహాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు పనిదినాలు కల్పించాలని, అదే సమయంలో 4 గంటలు పనిచేసేలా చూడాలని కోరారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో కూలీలు ఉపాధిహామీ పనులకు రావడం లేదని క్షేత్రసహాయకులు ఏపీడీ దృష్టికి తేగా కనీసం ఊరుకు 50 మంది వచ్చేలా చూడాలన్నారు. హరితహారానికి పంచాయతీ కార్యదర్శులు సమాయత్తం కావాలని, వనసర్సరీల్లో జూన్ కల్లా మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో శ్రీనివాస్, ఈసీ మోహన్, టీఏలు నర్సింహులు, యాదగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు పోగు అశోక్

కొడకండ్ల, డిసెంబర్ 20 : ఈ నెల 22న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు మండల కేంద్రానికి చెం దిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోగు అశోక్ ఎంపికయ్యారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహిస్తున్న సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయుల నుంచి పరిశోధన పత్రాలను ఆహ్వానించారు. వీరిలో పోగు అశోక్ ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా అశోక్‌ను స్థానిక సర్పంచ్, పద్మశాలి సంఘం బాధ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

'దుండగులపై చర్యలు తీసుకుంటాం'

జనగామ రూరల్, డిసెంబర్ 20 : వైకుంఠధామం ఆర్చిపై పేర్లను తొలగించిన దుండగులపై చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ రాములు తన తల్లిదండ్రులు అయిన బండ బీరప్ప-లక్ష్మి దంపతుల పేరుమీద గ్రామంలోని వైకుంఠధామం ఆర్చిని 2021లో సుమారు రూ.1.50లక్షల సొంత ఖర్చులతో నిర్మించి దానిపై తల్లిదండ్రుల పేర్లను రాశాడు. గుర్తు తెలియని దుండగులు కొందరు ఆర్చిపై ఉన్న పేర్లను కలర్‌తో తుడిపేశారు. దాత బండ రాములు విషయాన్ని గ్రామ సర్పంచ్ అంబాల ఆంజనేయులుగౌడ్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాడు. పేర్లను తొలగించిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసు కుంటామని సర్పంచ్ అంబాల ఆంజనేయులుగౌడ్ హామీ ఇచ్చాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ మూల రవిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు రేపాల కోటేశ్వర్‌రావు, గొలుసుల గద్దర్, హైస్కూల్ చైర్మన్ అంబాల శంకర్‌గౌడ్, నాయకులు సంకటి ఎల్లయ్య, ఎండీ జహీర్, అంబాల పెద్ద సంపత్, మంద లక్ష్మణ్, ఆత్మకూరి శ్రీనివాస్, కంత్రి రాజు, కొండబోయిన రాజు, బీర్ల మల్లేశం పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి'

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రజాప్రతినిధులు కోరారు. మండలంలోని కట్కూర్, గోపాల్‌నగర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం రెండు గ్రామాల్లో ప్రత్యేక సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ముశిని సునీతారాజుగౌడ్, పర్వతం మధుప్రసాద్ అధ్యక్షత వహించగా ఏపీజీవీబీ మేనేజర్ గురుప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ పథకాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌ఆచార్య, మోకు కవిత, సీసీ సత్యనారాయణ, విజయలక్ష్మి, డాక్టర్ రమ్య, వీవోఏలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి'కి స్ఫూర్తి

- ఒక్కరి స్వయం కృషి, నేడు పది మందికి ఉపాధి
- 'రెడీమేడ్' షర్ట్‌ల తయారీతో ఏటా రూ.10 లక్షల ఆదాయం
- వస్త్ర వ్యాపారంలో రాణిస్తున్న అవదూత దశరథ్

చొక్కాలు కుడుతున్న కార్మికులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 20 : కేవలం రూ.50 వేల పెట్టుబడి సాయంతో ఒక్కరితో మొదలైన 'ఉదయ్ రెడీమేడ్ గార్మెంట్స్' ప్రస్థానం పదేళ్లలో ఏడాదికి పది లక్షలు సంపాదించే స్థాయికి ఎదిగింది. మరో పది మందికి ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమగా మారింది. ఈ సంస్థ తయారు చేస్తున్న చొక్కాలు రెడీమేడ్ వస్త్ర ప్రపంచంలో బ్రాండెడ్ షర్ట్‌లతో పోటీపడుతున్నాయి. వెయ్యి అడుగులైనా ఒక్క అడుగుతో మొదలవుతుందన్న జీవిత సత్యాన్ని సరిగ్గా తన జీవితానికి ఆపాదించుకున్న సామాన్యుడు అవదూత దశరథ్. అతడి సక్సెస్ స్టోరీయే నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది. అవదూత దశరథ్ పుట్టి, పెరిగింది రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామం. చదివింది పదో తరగతి. సామాన్య మధ్య తరగతి కుటుంబం. తల్లిదండ్రులకు నాలుగో సంతానం. ప్రస్తుతం జనగామ పట్టణంలోని వీవర్స్ కాలనీలో భార్యా, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. జీవితంలో పైకి ఎదగడానికి 'టైలరింగ్' రంగాన్నే ఏకైక లక్ష్యంగా ఎంచుకున్నారు. పదేళ్ల క్రితం రూ.50 వేల పెట్టుబడితో ఇంట్లోనే రెడీమేడ్ చొక్కాలను రోజుకి 15 నుంచి 20 వరకు కుట్టి హోల్ సేల్ బట్టల షాపులకు విక్రయించేవారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ రావడంతో తన ఇంటినే కుటీర పరిశ్రమగా మార్చారు. ప్రస్తుతం మరో పది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ రోజుకి 150 రెడీమేడ్ షర్ట్‌లను తయారు చేసి హోల్ సేల్ షాపులకు సప్లై చేస్తున్నారు. కాటన్, స్పన్ క్లాత్‌లతో అన్ని రకాల సైజుల వారికి షర్ట్‌లను వివిధ డిజైన్లలో తయారు చేసి విక్రయిస్తున్నారు. వీరి వద్దకు నేరుగా వచ్చి కొనుగోలు చేసే వారికి ఒక్క షర్ట్‌ను కేవలం రూ.250కి అమ్ముతున్నారు.

వివిధ డిజైన్లతో కుట్టి ప్యాకింగ్ చేసిన అంగీలు

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే..

జీవితంలో ఎదగాలన్న పట్టుదలుంటే దేన్నయినా సాధించవచ్చు. కృషి ఉంటే ఏదైనా సాధ్యమే అన్న సూత్రాన్ని నేను బలంగా నమ్ముతాను. ఒకప్పుడు బతకడం ఎలా అనే ఆందోళన ఉండేది, కానీ ఈ రోజు పది మందికి బతుకుదెరువు ఇచ్చామన్న సంతృప్తి ఉంది. మేమంతా టీమ్ వర్క్‌తో పనిచేస్తాం. యజమాని, కూలీ అన్న తేడా లేదు. కష్టపడగా వచ్చిన సంపాదన సమష్టిగా పంచుకుంటాం.

- అవదూత దశరథ్, గార్మెంట్స్ యజమాని, జనగామ

దీంతో నిరుపేద, సామాన్య మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు పండుగ సీజన్లలో వీరి వద్ద ఎక్కువ మొత్తంలో కొత్త షర్ట్‌లను కొనుగోలు చేస్తున్నారు. చొక్కాల తయారీ కోసం ముంబయి నుంచి నేరుగా జనగామకు వీరు క్లాత్‌ను దిగుమతి చేసుకుంటున్నారు. ఈ సంస్థ తయారు చేసే చొక్కాలు నాణ్యత, మన్నికలోనే కాదు సామాన్య, మధ్యతరగతి వారికి అందుబాటు ధరల్లో ఉంటున్నాయి. దశరథ్ వ్యాపారానికి సీజన్, అన్ సీజన్ అనే తేడా లేదు. వీరంతా టీమ్ వర్క్‌తో పనిచేస్తారు. ఇక్కడ యజమాని, కూలీ అనే తేడా ఉండదు. తమకు వచ్చే సంపాదనను సమష్టిగా పంచుకుంటారు. పదో తరగతి వరకు మాత్రమే చదువుకున్న దశరథ్ తన కూతురిని ఫిజియో థెరపీ, కుమారుడ్ని సీఎంఏలో ఉన్నత విద్య చదివిస్తున్నారు. స్వయం కృషితో జీవితంలో ఒక్కడిగానే పైకి ఎదిగిన దశరథ్..ప్రస్తుతం మరో పది మందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక వేత్తగా మారారు.

అబ్బురపరిచిన కాళీమాతా ప్రదర్శన

అలరించిన కళాకారుల పగటి వేషధారణ

కాళీమాతా, రాక్షసుడి వేషధారణలో కళాకారులు

లింగాలఘనపురం, డిసెంబర్ 20 : తెలంగాణ సంస్కృతిలో భాగంగా పగటివేషధారణ కళాకారుల కళారూపాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన కళాకారులు ఉపాధి కోసం కళాప్రదర్శనలు ఇస్తున్నారు. ఐదేళ్లకోసారి లింగాలఘనపురంలో ఐదు రోజులు ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి విరాళాలు సేకరించారు. కాళీమాతా, రాక్షసుడి వేషధారణలో డప్పుచప్పుళ్ల మధ్య కళాకారులు గ్రామంలోని ప్రధాన వీధుల్లో కళారూపాలు ప్రదర్శించారు. అనంతరం దాతల నుంచి విరాళాలు సేకరించారు. మొదటిరోజు ఫక్కీరు వేషం, రెండోరోజు బ్రహ్మంగారు, మూడోరోజు లంబాడీ నృత్యం, నాలుగోరోజైన బుధవారం కాళీమాతా వేషధారణతో ప్రజలను ఆకట్టుకున్నారు. కళాకారులు కందుకూరి గంగయ్య, సిరిబాటి యాదగిరి, కందుకూరి యాకయ్య, కందుకూరి రమేశ్, కందుకూరి ప్రసాద్, కందుకూరి శివ, సిరిబాటి మహేందర్ పాల్గొన్నారు.

కండక్టర్ లేకుండానే వెళ్లిన ఆర్టీసీ బస్సు

చిన్నపెండ్యాలలో గుర్తించి నిలిపిన డ్రైవర్

చిన్నపెండ్యాలలో నిలిచిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు

చిల్పూరు, డిసెంబర్ 20: కండక్టర్ లేకుండా ఆర్టీసీ బస్సును తీసుకెళ్లిన డ్రైవర్ మరో స్టేజీ వరకు వెళ్లాక గుర్తించి కొద్దిసేపు నిలిపిన ఉదంతం వరంగల్-జనగామ హైవేపై చిన్నపెండ్యాలలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బుధవారం జనగామ నుంచి హనుమకొండకు బయల్దేరింది. ఉదయం 6.40 గంటల ప్రాంతంలో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకోగా కండక్టర్ బస్సు దిగి కంట్రోలర్ వద్దకు వెళ్లారు. దీనిని గమనించని డ్రైవర్ బస్సును తీసుకెళ్లాడు. చిన్నపెండ్యాల సమీపంలో ప్రయాణికులు గుర్తించి చెప్పడంతో అక్కడ నిలిపివేసి కండక్టర్‌కు ఫోన్ చేశాడు. 20నిమిషాల్లో మరో బస్సులో కండక్టర్ రావడంతో బస్సును యథావిధిగా తీసుకెళ్లారు. జరిగిన అసౌకర్యంతో ప్రయాణికులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

23న జీడికల్ ఆలయంలో వేలం

లింగాలఘనపురం, డిసెంబర్ 20 : జీడికల్ ఆలయ ప్రాంగణంలో ఈ నెల 23న కొబ్బరికాయల విక్రయాల కోసం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో శేషుభారతి తెలిపారు. జీడికల్ ఆలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ వేలం కాల పరిమితి 2024 జనవరి 1నుంచి 2024 డిసెంబర్ 31వరకు ఒక సంవత్సర కాలం పాటు ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.50వేలు ధరావత్తుగా చెల్లించి పాల్గొనాలన్నారు. గత సంవత్సరం ఈ వేలం ద్వారా ఆలయానికి రూ.1.96లక్షల ఆదాయం లభించినట్లు ఆమె తెలిపారు. ఈ పర్యాయం వేలం పాటను రూ.1.96లక్షలనుంచి ప్రారంభిస్తామన్నారు. టెండరు దక్కించుకున్న వ్యక్తి డిపాజిట్ కాకుండా పాటలో సగం డబ్బులను వెంటనే చెల్లించాలని వివరించారు. సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో మెరిసిన సెయింట్ మేరిస్ విద్యార్థి

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఈనెల 19న మహబూబాబాద్‌లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవల్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో హైదరాబాద్ రోడ్‌లోని సెయింట్ మేరిస్ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఈ శశికాంత్ ప్రతిభ కనబర్చాడు. దీంతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జైమోన్ థామస్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని సూచించారు. శశికాంత్ జనగామ జిల్లాకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. శిక్షకుడు రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు గుణవర్ధన్, నరసింహ్మ, హేమలతను ఆయన అభినందించారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 20 : ఎలక్ట్రికల్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగింది. ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బస్టాండు సమీపంలోని రెడ్డి మెస్ ఎదురుగానున్న సాయిప్రసన్న ఎలక్ట్రికల్ షాపు యజమాని చాగంటి రాజన్న రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున రాజన్న షాపు వైపు వెళ్లి చూడగా షట్టర్ తొలగించినట్లు కనిపించడంతో లోపలికి వెళ్లి పరిశీలించాడు. షాపులో దొంగలు పడి రూ.65 వేల నగదును చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సట్ల రాజు, ఎస్సై హరికృష్ణ షాపును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి
- సీఎంను కలిసి వినతిపత్రం అందించిన కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేరిపోతుల పరశురామ్

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని, దీనిపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సమితి నాయకుడు జేరిపోతుల పరశురామ్ మంగళవారం రాత్రి ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పరశురామ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్‌లో ఈ అంశంపై మాట్లాడి రాష్ట్రపతికి లేఖ రాశానని చెప్పారన్నారు. దీనిపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. కార్యక్రమంలో జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ, వీరన్ అప్పు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట దవాఖానలో కు.ని శిబిరం

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం డాక్టర్ రవిరాథోడ్ నేతృత్వంలో ఆరుగురు పురుషులకు వేసక్టమీ ఆపరేషన్లు చేశారు. మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ త్వరలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ నియంత్రణతోనే సమాజంలో పురోగతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సృజన, సూపర్‌వైజర్ చారి, జబ్బార్ ఫార్మాసిస్టు శ్రీనివాస్, సిబ్బంది విజయ, అనిత తదితరులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లు ఏడాదికి రూ.360 చెల్లించాలి

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ వినియోదారులు తాము వినియోగిస్తున్న బోర్లు, బావులకు సంబంధించిన కరెంటు బిల్లు సంవత్సరానికి రూ.360 మాత్రమే చెల్లించాలని ట్రాన్స్‌కో జనగామ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన చేశారు. పాత బకాయిలుంటే మొత్తం చెల్లించాల్సి ఉంటుందని లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి, డిసెంబర్ 20 : తెలంగాణలోని ప్రభుత్వ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని యాదాద్రి రీజియన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయ అధికారి ఎన్ రజిని తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీఆర్ఐఎస్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్షను 2024 ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. దరఖాస్తులను జనవరి 6వ తేదీ వరకు రూ.100లు రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సొసైటీకి చెందిన వెబ్‌సైట్, సమీపంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

జఫర్‌గఢ్, డిసెంబర్ 20 : మండలంలోని తిమ్మంపేట హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సాఫ్ట్ బాల్ క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్‌డీఎల్‌సీఈ క్రీడా మైదానంలో 67వ స్కూల్‌గేమ్స్ అండర్-17 విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇందులో జనగామ జిల్లా నుంచి తిమ్మంపేట హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ధరంసోతు రాజేందర్(10), జాటోత్ అంజి (10), బాలికల విభాగంలో నిఖిత(9) ఉన్నారు. ఈ నెల 21నుంచి 23వరకు నిర్మల్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల శాశ్వత క్రీడాదాత చాడ ప్రదీప్‌రెడ్డి, జడ్పీటీసీ ఇల్లందుల బేబీశ్రీనివాస్, సర్పంచ్ మంద మల్లేశ్, పీఈటీ కొండ రవి అభినందించారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 20 : స్థానిక రైల్వే ఫ్లైఓవర్ సమీపంలోని శివాజీ విగ్రహాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినందున దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు సీఐ సట్ల రాజుకు వినతిపత్రాన్ని అందజేయగా, నిందితులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐని కలిసిన వారిలో నాయకులు అనంతుల నాగరాజు, సదానందాచారి, గణేశ్, అరవింద్, పసునూరి సందీప్, శరత్, రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట పీఎస్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. సిబ్బంది విధుల నిర్వహణ, ఠాణాలో కేసుల వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఆయన సూచించారు. సీఐ సాయిరమణ, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

'సర్పంచ్‌ను విధుల నుంచి తొలగించాలి'

రఘునాథపల్లి, డిసెంబర్ 20: రిమాండ్‌లో ఉన్న స్థానిక సర్పంచ్ పోకల శివకుమార్‌పై చర్యలు తీసుకుని పదవి నుంచి తొలగించాలని కోరుతూ వార్డు సభ్యురాలు శాడ భాగ్య బుధవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ నెల 18న ఓ కేసులో సర్పంచ్‌కు జైలుకు వెళ్లారని, శివకుమార్‌పై ఇంతకు ముందు పలు కేసులు ఉన్నందున పదవి నుంచి తొలగించాలని ఆమె కోరారు.

ఆరోపణలు అవాస్తవం..

బచ్చన్నపేట, డిసెంబర్ 20 : గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా నిధులు డ్రా చేస్తున్నారని తనపై ఆరోపణలు చేయడం సరికాదని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై కావాలని కొందరు వార్డు సభ్యులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రతి తీర్మానంలో సర్పంచ్ సంతకం ఉంటుందని, ఈ విషయాన్ని వారు గమనించాలన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

అభివృద్ధి పనులపై పింకేష్‌కుమార్ పరిశీలన

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : జనగామ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పట్టణ అవసరాలకు వినియోగిస్తున్న పలు ప్రాంతాలను బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పర్మర్ పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బృహత్ పట్టణ ప్రకృతివనం(బీపీవీ), డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ పనులు, రాంనగర్‌లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని(ఎఫ్ఎస్‌టీపీ) ఫిల్టర్‌బెడ్‌లోని నీటిశుద్ధి కేంద్రం, నిర్మాణంలో ఉన్న మోడల్ వెజ్-నాన్ వెజ్ మార్కెట్ యార్డు నిర్మాణం, శ్మశాన వాటిక ప్రాంతాలను ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళితో కలిసి పరిశీలించారు. అనంతరం నెల్లుట్ల ప్రాంతంలో మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించే స్థలాన్ని పరిశీలించి, పనులు పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, క్రమం తప్పకుండా నిర్మాణాలు చేపట్టి నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని పింకేష్‌కుమార్ ఆదేశించారు. అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ మహిపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు ఉన్నారు.

చంపక్‌హిల్స్ వద్ద మున్సిపల్ మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలి

జనగామ, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలర్పించిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కోరింది. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యమకారులు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. అమరుల కుటుంబాలకు అండగా నిలబడి ఆత్మస్థైర్యాన్ని ఇచ్చేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులను గుర్తించి పింఛన్లు ఇవ్వడంతోపాటు ఉచితంగా రైళ్లు, బస్సుల్లో పాస్‌లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గండి నాగరాజు, మంతెన మణికుమార్, వంగ భీమ్‌రాజ్, నీలం రామ్ మనోహర్, కొ య్యడ శ్రీనివాస్, బండ యాదగిరిరెడ్డి, రావెల రవి, ఎంపీపీ కళింగరాజు, సింగారపు ప్రశాంత్, యాదవ్, తిప్పారపు ఆనంద్, జీవై కృష్ణ, తిప్పారపు విజయ్, మంగళంపల్లి